# అపశ్రుతి

రోజారమణి పెళ్ళికి అలా వెళ్ళవలసి వస్తుందని నేను కలలోనైనా ఊహించలేదు. ఆమె పెళ్ళి శుభలేఖ నాకు రాలేదు. రోజారమణి పెళ్ళి నేను లేకుండా జరగదని నాకు నమ్మకంగా ఉండేది.

రోజారమణి పెళ్ళికూతురుగా పెళ్ళిపీటల మీద కూర్చుంటే ఆమె పక్కన నేను పెళ్ళికొడుకుగా ఉంటాను. ఆమె మెడలో నేను పుస్తె ముడివేస్తాను అని ఆరోజుకోసం నిరీక్షించేవాడిని.

గత మూడేళ్ళుగా మేం ఒకరికొకరం చేరికయ్యాము. మా మధ్య ప్రేమ రోజురోజుకీ ధృఢపడింది. నన్ను వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ చేశారు.

"రాజూ! నీవు లేని జీవితాన్ని ఊహించుకోలేను. నువ్వే నా సర్వస్వానివి" అంది నేనావూరు విడిచి వెళ్తూంటే, మేం ఇద్దరం ప్రేమించుకున్న సంగతి ఇరుపక్కలవారికీ తెలుసు. ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. నేను ఆమెతో ఎంత చనువుగా తిరిగినా తొందరపాటుగా వ్యవహరించలేదు. రోజా నాకు చేరువ కావాలని ఆశించేది. నన్ను కవ్వించేది. నేను నిగ్రహం పాటించేవాడిని.

పెళ్ళికి ముందు అపశ్రుతి జీవితాంతం మమ్మల్ని అట్టిపెట్టుకుని ఉంటుంది. ఎంత ఆలూమగలమయినా ఆ మచ్చ తొలగదు. అందుకే నేను నిష్ఠగా ఉండి రోజారమణి కోరికను సున్నితంగా తిరస్కరించేవాడిని. ఆమె అలిగేది.

చాలారోజులై రోజారమణి దగ్గరనుంచి ఉత్తరాలు లేవు. మా అమ్మ నా పెళ్ళిగురించి తొందర పడుతున్నది. అందుకే ఆమెను కలవాలనుకున్నాను. ఆమె తల్లిదండ్రులతో మాటలాడి పెళ్ళి ముహూర్తం నిర్ణయించమని చెప్పాలనుకున్నాను.

ఆ ఇంటి అలంకరణ చూసి రిక్షా దిగుతూ నేను ఆశ్చర్యపోయాను. ఆ ఇల్లు పెళ్ళికళతో కళకళలాడుతోంది. రోజారమణి పెళ్ళి నేను లేకుండా జరిగేది కాదు. బహుశా ఆమె అన్నపెళ్ళి కావచ్చు. అతను మిలట్రీలో పనిచేస్తున్నాడు.

నా ఊహతప్పని తెలుసుకోవడానికి ఎక్కువ సేపు పట్టలేదు. నన్నుచూసి కొందరు పెళ్ళి పందిరిలో చెవులు కొరుక్కుంటున్నారు.

నన్ను గాఢంగా ప్రేమించి, ఎన్నో బాసలు చేసి, నీవు లేనిదే ఒక్క క్షణం కూడా బ్రతకలేనని నన్ను వాటేసుకునే రోజారమణి వేరొకరిని చేసుకుంటున్నదని తెలిసిన నాకు ప్రపంచం అంతా శూన్యంగా కనిపించింది. స్త్రీజాతిమీద విరక్తి పుట్టింది.

పెళ్ళిపందిరిలో వెంకట్రామయ్యగారు కనిపించారు. అతనే పెళ్ళి పెద్ద. రోజా తండ్రి. మా ఇద్దరి చూపులు కలుసుకున్నాయి.

"రావయ్యా! రాజశేఖరం! నువ్వు పెళ్ళికి తప్పక వస్తావనే అనుకున్నాను" అన్నారు నవ్వుతూ

నిన్న మొన్నటివరకు అల్లుడి హోదాలో నాకు మర్యాదలు జరిపేరు. అతని ముఖంలో ఎలాంటి న్యూనతా లేదు. వారిని ఆ పరిస్థితుల్లో కలిసినందుకు నాకే మనసు చెల్లలేదు. వారిని ఇరుకులో పెట్టేనేమోనని మనసులో అనుకున్నాను.

"రోజారమణి పెళ్ళి అని నాకు ఇక్కడకు వచ్చేవరకు తెలియదు" తప్పుచేసినవాడిలా అన్నాను. వెంకట్రామయ్యగారి ముఖంలో చిరునవ్వు. నన్ను కాదని రోజారమణి పెళ్ళి వేరొకరితో ఎందుకు చేయవలసి వచ్చిందో చెప్పాలని అతనికి అనిపించలేదు.

"నీకు రమణి శుభలేఖ పంపలేదా? పంపే ఉంటుందనుకున్నాను. ఏమైతేనేం సమయానికి నీవు వచ్చావు. చాలా సంతోషం. లోపలకు వెళ్ళు. కాఫీ ఫలహారాలు తీసుకో" అంటూనే వేరే పనిమీద అతను ఎటో వెళ్ళిపోయాడు.

నా ఉనికి వలన ఆ పెళ్ళి అభాసుపాలౌతుందన్న చింత అతనికి రవ్వంతైనా లేదా? నేను పిలవని పెళ్ళికి వచ్చాను. ఇంతకంటే అవమానం ఏముంటుంది? వెళ్ళిపోదామని వెనుతిరిగాను.

"ఏమండీ! మీరోమారు నాతో వస్తారా! రోజారమణి మిమ్మల్ని పిలుస్తున్నది" అంది ఒక అమ్మాయి. ఎందుకు కలవాలి? ఆమెతో నాకేం పని? ఆమెను కలిసి నాలోని కసి బైటకు కక్కాలనుకున్నాను అంతలోనే. జరగవలసిందేదో జరిగిపోయింది. ఇప్పుడు నా కోపతాపాలు ఎవరిమీద పనిచేస్తాయి?

ఆమె ఏవో సాకులు చెప్పి తనను క్షమించమని కాళ్ళమీద పడుతుంది. లోగడ తాను రాసిన ప్రేమలేఖలు ఇచ్చి తన కాపురాన్ని నిలబెట్టమని అర్థిస్తుంది. అంతకుమించి ఆమె చెప్పేది ఏమి ఉంటుంది? ఈ పెళ్ళి వెనుక కారణాలు తెలుసుకోవాలంటే ఆమెతో మాట్లాడాలి. బహుశా రోజారమణిది తప్పు అయి ఉండదు. ఆడది అస్వతంత్రురాలు. తల్లీదండ్రీ వత్తిడి తెచ్చి వుంటారు.

"నిజమే! నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. ఇప్పుడు మనసు మార్చుకున్నాను. నీకు తెలుసో తెలియదో నాకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గజిటెడ్ జాబ్ దొరికింది. నా కాబోయే భర్త పెద్ద జీతగాడు" ఆనందంగా అంది రోజారమణి.

"అందువలన నీవు మనసు మార్చుకున్నావు. గతంలో చేసిన వాగ్దానాలు మరిచిపోయావు. ఇంతకాలం పురుషులే నిలకడలేనివారని, ఏరుదాటి తెప్పతగలేసేరకంవారని అనుకుని భ్రమపడ్డాను. మీ స్త్రీలు మాకంటే ముందంజ వేస్తున్నారు. శభాష్!" అన్నాను. నాలో వున్న ఉక్రోషం అంతా మాటల రూపంలో బయటికొచ్చింది.

"ఇందులో నా పాపం ఏమీలేదు. మా తల్లిదండ్రుల బలవంతం మీద తప్పనిసరయి మెడలు వంచాను' అని ఆమె చెప్పి వుంటే ఆమె నిస్సహాయస్థితిని అర్థం చేసుకుని జాలిపడేవాడిని.

"రాజూ! నిన్ను పెళ్ళి చేసుకోకపోవడానికి మరో కారణం ఉంది" అంది రోజారమణి.

"ఆ కారణం నీవుచెప్పాలా? పెళ్ళికి డబ్బే ప్రధాన కారణమని నీకు ఇప్పుడిప్పుడే తెలిసి ఉంటుంది. నీవు చాలాఆలస్యంగా తెలుసుకున్నావు. చిన్నప్పుడు చదువుకొని ఉండవు భర్తృహరి పద్యాన్ని.

ఏ నరునకు విత్తమ్ము గల<br>
దా నరుడు కులీనుడధికు డార్యుడతండే<br>
ధీనిధి ధన్యుడు నేర్పరి

నానా గుణగణము కాంచనంబున నిలుచున్

ఆరు ప్రత్యేకతలు చెప్పి మిగతావి ఇంకెన్నో అన్నాడు" రాజశేఖరం అన్నాడు.

"ఛ! అదికాదు కారణం. ధనంమూలం ఇదం జగత్తని నా కేనాటినుంచో తెలుసు. నీ ఉద్యోగం సామాన్యమైనది. నేను పెద్ద ఉద్యోగస్తురాలిని. అది ఒక పాయింటే" అందామె.

"ఇంకా ఏమైనా పాయింట్లు ఉన్నాయా?"

"నీకు బట్టతల తొందరగా వస్తుంది. అప్పుడు నీ పక్కన భార్యగా ఉండడం నాకు చిన్నతనంగా ఉంటుంది" అంది నవ్వుతూ.

ఆమెకు జ్యోతిష్యశాస్త్రం తెలుసా? ఇప్పుడు నా వయసు ఇరవై అయిదు సంవత్సరాలు. నా అందం చూసే ఆమె నా పట్ల ఆకర్షితురాలయింది.

ఎప్పుడో ఏదో ఔతుందని ఆమె ఎంతముందు జాగ్రత్త తీసుకుంటున్నది. తన కాబోయే భర్తకు బట్టతలరాదన్న గ్యారంటీ ఏమిటి?

రోజారమణి ఆ విషయం సీరియస్‌గా తీసుకొని అనలేదు నవ్వుతాలకు అంది. క్షణక్షణముల్ జవరాంద్ర చిత్తముల్. ఆ తరువాత తన పెళ్ళికి ఉండమంది కాని నేను ఉండలేదు.

★ ★ ★

"ఏమండీ! ఏమిటా పరధ్యానం? కాఫీ అక్కడ పెట్టి పదినిముషాలైంది" అందామె.

శ్రీమతి మాటలతో ఈలోకంలో పడ్డాను.

"ఆc! ఏదో ఆలోచిస్తూ మరచిపోయాను" అంటూ కాఫీ కప్పు అందుకున్నాను.

"ఉండండి. చల్లారిపోయింది. మళ్ళీ వేడిచేసి తెస్తాను" ఆమె నా చేతిలోని కప్పు తీసుకుంది.

రోజారమణి నన్నుకాదని వేరొకరిని పెళ్ళి చేసుకున్నందున చాలాకాలం బ్రహ్మచారిగానే ఉండిపోయాను. మా అమ్మకు అది నచ్చలేదు. మరో పిల్లను చేసుకోమని బ్రతిమలాడేది.

ఒకరోజు వృత్తికతో పరిచయమైంది. పరిచయమైంది అన్నమాట వాస్తవం కాదు. నేనామెతో మాట్లాడనైనా లేదు. కేవలం ఆమెను చూశాను. ఆమె తమ్ముడు భాస్కరరావు నాతోపాటు పనిచేస్తున్నాడు. కాకతాళీయంగా ఆఫీసునుంచి నేరుగా వాళ్ళ ఇంటికి వెళ్ళాను.

సోఫాలో కూర్చుని మేం ఇద్దరం టీ తాగుతూ మాట్లాడుకుంటున్నాం. అప్పుడు ఆమె మెరుపు తీగలా ప్రవేశించి, నన్నుచూసి ఒక్క క్షణం బిత్తరపోయి నమస్తే చెప్పి ముందుకు వెళ్ళింది.

"వృత్తికా! ఓమారిలా వస్తావా?" భాస్కరం ఆమెను పిలిచాడు. అప్పుడే ఆమెపేరు వృత్తిక అని తెలిసింది. వృత్తిక మా దగ్గరకు వచ్చి ఎందుకన్నట్లు చూసింది తమ్ముడివంక. బాగా అలసిపోయి వున్నట్లుంది. ఆమె ముఖంమీద స్వేదబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి.

"ఇతను రాజశేఖరం! మా ఆఫీసులోనే పనిచేస్తున్నాడు. ఈమె నా అక్క పేరు వృత్తిక. సెంట్రల్ బ్యాంకులో ఉద్యోగం" అంటూ పరిచయం చేశాడు.

ఆమె మరోమారు నమస్కారం చేసింది.

ఆమెకు పెళ్ళి అయిన సూచనలు లేవు. మెడలో పలుచని గొలుసు. ఒక చేతికి రెండు బంగారు గాజులు, వేరొక చేతికి రిష్టువాచి. రోజారమణిలా పెద్ద అందగత్తె కాకపోయినా చూడడానికి బాగానే ఉంది. చాలా సింపుల్‌గా ఉంది.

ఆమెను చూడగానే నా మనసు చలించింది. భాస్కరం ఇంతకాలం తన అక్క గురించి నాకు చెప్పలేదు. ఆమెకు ఇంతవరకు పెళ్ళికాలేదా? తను పెళ్ళి చేసుకున్నాడు. మరి అక్క విషయంలో ఎందుకు ఉపేక్ష? ఆమె నేటితరం స్త్రీ. పెళ్ళికి ఆమె విముఖంగా ఉందేమో? చాలామంది చదువుకున్న స్త్రీలు తమ కెరియర్ విషయమే ఆలోచిస్తున్నారు. స్వావలంబన, ఆర్థిక స్వాతంత్ర్యం వారు కోరుకుంటు న్నారు. పెళ్ళి చేసుకుంటే పిల్లల్ని కనాలి. వెట్టిచాకిరి చెయ్యాలి. బానిస బతుకు బతకాలి. బహుశా ఆమె సిద్ధాంతాలు అవే కాబోలు.

కొంతసేపు కూర్చుని నేను ఇంటికి వచ్చాను.

నా తలపులతో వృత్తికను కూడా తీసుకు వచ్చాను. రోజారమణి తరువాత నన్నే స్త్రీ ఇంతగా ఆకర్షించలేదు. వృత్తిక మంచి ఉద్యోగం చేస్తున్నది. చూడ సొంపుగానే ఉంది. మరి ఇంతకాలం అవివాహితగా ఎందుకుంది? ఆమె గురించి నేనెందుకు అంతగా ఆలోచించాలి? నాకు కాని విషయాల జోక్యం సబబు కాదు. అయినా నా ఆలోచనలు వృత్తిక చుట్టే పరిభ్రమిస్తున్నాయి.

నేను అవివాహితుడనని భాస్కరానికి తెలుసు. అయినా వృత్తిక గురించి మాట మాత్రమైనా చెప్పలేదు. అంటే నేను వారికి నచ్చలేదా? లేక వేరే కారణాలున్నాయా? ఏ విషయాలను మరిచిపోవాలను కుంటామో అవే పదే పదే తలపుకి వస్తాయి.

వృత్తిక నా సహధర్మచారిణి కావాలని నేను కోరుకుంటున్నానా? ఒక పర్యాయం పెళ్ళి విషయంలో మోసపోయాను. మళ్ళీ ఆ ఊబిలోనికి దిగాలా?

సేవింగ్స్ బ్యాంక్ ఎకౌంట్ తెరవాలనే మిషమీద కావాలనే నేను ఒకరోజు సెంట్రల్ బ్యాంకుకి వెళ్ళాను. అదృష్టవశాత్తు అదే కౌంటర్‌లో వృత్తిక ఉంది. నన్ను చూసి ఆశ్చర్యపోయింది. నమస్కారం చేసి ఏం పనిమీద వచ్చారని అడిగింది.

నేనొచ్చిన పని చెప్పాను. లోనికి రమ్మనమని తన సీటు పక్కనే కూర్చోమంది. నా పని నిముషాల మీద అయిపోయింది. పాస్‌బుక్ నా చేతికిస్తూ – "ఈ బ్రాంచి మీ ఆఫీసుకి చాలా దూరం. మీరు ఇక్కడ ఎకౌంట్ ఎందుకు ఓపెన్ చేసారో నాకు అర్థంకావడంలేదు. అయినా మా బ్యాంక్‌లో ఎకౌంట్ ఓపెన్ చేసినందుకు ధన్యవాదాలు" అంది.

ఎవరైనా బ్యాంక్‌లో ఎకౌంట్ ఓపెన్ చేసినా లేక ఎవరైనా తమ ఎకౌంట్ క్లోజ్‌చేసినా బ్యాంకు ఉద్యోగులకు లాభించేదీ లేదు. వారు నష్టపోయేదీ లేదు. తమ బ్యాంకు పట్ల ఆమెకు గల నిబద్ధతకు నాకు ఆశ్చర్యం వేసింది. ఆనందం కలిగింది.

ఆమెతో ఏదో చెప్పాలని ఉంది.

అసలు నేను వచ్చిందే అందుకు. కాని ఆమె క్షణం తీరికలేని సీటులో ఉంది. ఆమె నా పనికోసం అటూ ఇటూ తిరుగుతూ ఉంటే కొందరు కస్టమర్లు ఆగ్రహించుకున్నారు కూడాను.

"మూడునుంచి అనుకుంటాను మీ లంచ్ అవర్. బయట కేంటీన్‌లో మీకోసం ఎదురుచూస్తూ ఉంటాను" అని ఆమెతో చెప్పి ఆమె ఏమి జవాబు చెపుతుందో వినకుండా బయటకొచ్చాను నేను.

అప్పుడింకా రెండున్నర కాలేదు.

నా గుండెలు రాజధాని ఎక్స్‌ప్రెస్ స్పీడులో కొట్టుకుంటున్నాయి. వృత్తిక స్వభావం నాకు తెలియదు. ఆమె నా ప్రపోజల్‌ను అంగీకరిస్తుందా? అసలు ఆమె గతం ఏమిటి? ఆమెకింతవరకు

పెళ్ళి కాలేదా? పెళ్ళి అయినా భార్యాభర్తలమధ్య సయోధ్య లేక విడిపోయారా? లేక ఆమె భర్త చనిపోయాడా? నేను ఏ విషయాలు తెలుసుకోకుండా అనవసరంగా తొందరపడుతున్నానా?

మరోమారు శృంగభంగమయితే నేను తట్టుకోగలనా? ఆమెతో ఎలా మాట్లాడాలో ఒకటికి పదిసార్లు రిహార్సల్స్ వేసుకున్నాను.

"సార్! మీ టీ చల్లారిపోయింది. మరొకటి పట్టుకురానా?" సర్వరన్నాడు.

"ఇది ఇక్కడ్నించి తీసుకుపో. కొంతసేపు తరువాత మళ్ళీ ఆర్డరిస్తాను. అప్పుడు దీని డబ్బులు ఆ బిల్లులో కలుపు" అన్నాను.

మూడుకావస్తోంది. జనాలు కేంటీన్‌లోనికి వస్తున్నారు. నా చూపులు ఎంట్రన్స్ వేపే వున్నాయి. కొంతసేపటికి వృత్తిక వచ్చి గేటుదగ్గరే నిలబడి నేనెక్కడ ఉన్నానో అని నాలుగుపక్కలా చూస్తోంది. నేను గాలిలో చెయ్యి ఊపాను.

ఆమె నవ్వుతూ వచ్చి నా ఎదురుగా కూర్చుంది.

"ఏమిటో మీరు అకాలవర్షంలా వచ్చారు. ఇంతకీ ఏమిటి చెప్పాలనుకుంటున్నారు?" అంది.

మా ఇద్దరికోసం దోశలు ఆర్డరిచ్చాను.

"ముందు తినండి. ఆ తరువాత మాట్లాడుకుందాం" అన్నాను. అప్పటికీ నాలో ధైర్యం లేదు.

దోశ తిని ఇద్దరం టీ తాగేం.

వృత్తిక నిశ్చలంగా కూర్చొని ఉంది. ఆమెలో ఎలాంటి ఆత్రుతా కనిపించడంలేదు. నేను ఏమి చెప్పదలుచుకున్నానో తెలుసుకోవాలన్న క్యూరియాసిటీ కూడా ఆమెలో లేదా? ఆమె స్థానంలో నేనుంటే ఆ టెన్షన్ని భరించలేకపోయేవాడిని.

వృత్తిక నా అంచనాలకు అందటంలేదు.

ఎన్నిమార్లు రిహార్సల్స్ వేసుకున్నా నేను ఏదీ చెప్పలేక ఆమెవంక చూడలేక ముఖం దించేసుకున్నాను. ఆమె మరోమారు ప్రశ్నిస్తే అప్పుడు చెప్పాలనుకున్నాను. కాని ఆమె నోరు విప్పలేదు.

చివరకు తెగించవలసి వచ్చింది.

రోజారమణితో నా ప్రేమ వ్యవహారం, ఆమె నన్ను తిరస్కరించి వేరొకరిని చేసుకున్న సంగతి సంక్షిప్తంగా చెప్పాను. నాకప్పటినుంచి స్త్రీజాతి మీద ద్వేషంగా ఉందని అందువలననే ఇంతకాలం పెళ్ళిమాట తలపెట్టలేదని చెప్పాను. అమ్మకు నేను బ్రహ్మచారిగా జీవించడం ఇష్టంలేదు. పెళ్ళి చేసుకోమని పోరుతోంది అని చెప్పాను.

ఎందరో ఆడపిల్లలు నా జీవితంలో ప్రవేశించాలని కోరుకుంటున్నా నేను ఎవరిని చేసుకుందికి ఇష్టపడలేదని చెప్పాను.

"అమ్మ బలవంతం చేస్తున్నదని కాదు, ఆనాడు మిమ్మల్ని చూసిన తరువాత మన్మథుడు నామీద పూలబాణాలు సంధించాడేమోననిపించింది. మీ పట్ల అంతగా ఆకర్షితుడనయ్యాను. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని నాసహధర్మచారిణిగా ఆహ్వానిస్తున్నాను." అని చెప్పాను.

ఒక హైస్కూలు విద్యార్థి బట్టీ పట్టిన పాఠం అప్ప చెప్పినట్లు అంతా వివరంగా చెప్పాను. నాకు చెమటలు పట్టాయి. రుమాలుతో ముఖం తుడుచుకున్నాను. మంచినీళ్ళు తాగాను.

అంతా విన్న వృత్తిక మృదుమధురంగా నవ్వింది. అది తృణీకారమా – అంగీకారమా?

ఆమె నిర్ణయం నేను ఆశించింది కాకపోయినా బాధపడకూడదని ముందే నిర్ణయించుకున్నాను. అయితే వృత్తిక నన్ను చేసుకునేందుకు ఇష్టపడకపోతే అమ్మకోరిక ఈ జన్మలో నెరవేరదు.

"మన పెళ్ళికి మరెలాంటి షరతులు లేకపోతే నాకెలాంటి అభ్యంతరమూ లేదు. అయితే నాదొక షరతు ఉంది" అంది నవ్వుతూనే.

నా గుండెలమీద నుండి పెద్ద బరువు దింపినట్లైంది. అంతలోనే ఆమె షరతు ఏమై ఉంటుందో అర్థంకాక ఆందోళన చెందాను. ఆమె షరతు ఎలాంటిదైనా అంగీకరించాలనే అనుకున్నాను.

"చెప్పండి" అన్నాను నెమ్మదిగా.

"మన పెళ్ళి ఒక నెల తరువాతే. ఈలోగా నేనే నిర్ణయం తీసుకున్నా మీరు ప్రశ్నించకూడదు. భయపడకండి మిమ్మల్ని పెళ్ళిచేసుకోను అని అనను"

అమ్మయ్య.... ఇదొక పెద్ద షరతా?!

"నాకెలాంటి అభ్యంతరమూ లేదు. అయినా నెలరోజులనగా ఎంత? ఏమండీ!.."

"నా పేరు వృత్తిక. మీరు ఆ పేరుతో పిలిస్తేనే నాకు సంతోషంగా ఉంటుంది" అన్నదామె.

"వృత్తికా! నాదొక రిక్వెస్టు"

"షరతు కాకపోతే చెప్పండి"

"వచ్చే ఆదివారం భాస్కరాన్ని తీసుకుని మీరు మా ఇంటికి రావాలి. మా అమ్మ మిమ్మల్ని చూస్తుంది. భోజనాలు కూడా అక్కడే" అన్నాను.

"రివర్స్ పెళ్ళిచూపులా? అలాగే వస్తాను".

భాస్కరానికీ విషయాలు మర్నాడు ఆఫీసులో చెప్పాను. తనకు మాటమాత్రం చెప్పకుండా చొరవ తీసుకున్నందుకు క్షమాపణలు చెప్పాను.

"ఈ విషయాలన్నీ నాకు నిన్ననే తెలిశాయి. ఇకమీదట నువ్వు మా గ్రూపులో చేరుతున్నావు. అదే సంసారుల గ్రూపులో" నాకు కంగ్రాట్స్ చెప్పాడు భాస్కరం.

మా పెళ్ళి జరిగేవరకు వృత్తిక తన జాబ్‌కి రిజైన్ చేసిందని తెలియదు. నెలరోజుల నోటీసు ఇవ్వవలసి ఉన్నందున ఆ వ్యవధి కోరింది.

ఆమె మంచి ఉద్యోగానికి రాజీనామా చేసినందుకు నేను బాధపడ్డాను. ఉద్యోగానికి ఎందుకు రాజీనామా చేశావు అని ఎన్నిమార్లు అడిగినా ఆమె సరియైన సమాధానం ఇవ్వలేదు.

★ ★ ★

"నేనడిగిన ప్రశ్నకు జవాబివ్వలేదు" మరో కప్పు కాఫీ తెచ్చి నాకిస్తూ అడిగింది వృత్తిక.

"ప్రతి స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం కోరుకుంటుంది. నువ్వు పెళ్ళికి ముందునుంచి ఉద్యోగం చేసేదానివి. నీవు ఆ ఉద్యోగాన్ని ఎందుకు వదులుకున్నావో నాకిప్పటికీ అర్థంకాలేదు" అన్నాను.

"ఏమండీ! మీరేదో దాస్తున్నారు. ఈ ప్రశ్న ఎన్నోసార్లు వేశారు. అదే విషయం ఆలోచిస్తున్నారంటే నేను నమ్మను" అంది వృత్తిక.

"డైరెక్ట్‌గా కాకున్నా ఇండైరెక్ట్‌గా ఆ విషయమే ఆలోచిస్తున్నాను. రోజారమణి ఉత్తరం రాసింది. దాంతో నా గతమంతా గిర్రున తిరిగింది.

"కొంపతీసి ఆమె భర్తకు బట్టతల వచ్చిందా? ఇప్పుడా మొగుడిని వదిలేసి" అర్ధోక్తిగా ఆగింది.

"పదిలేసి?"

"నా పచ్చని సంసారంలో నిప్పులు పోయాలనుకుంటున్నదా? ఆమెకు మీరేమౌతారు? పనిగట్టుకుని మీకెందుకు ఉత్తరం రాసింది?"

"అదేంకాదు. ఉత్తరం చదువు" అన్నాను.

"మీ మాజీ ప్రియురాలి ఉత్తరాన్ని నేనెలా చదవను?" అంది వృత్తిక.

"అందులో నీవు కలత చెందాల్సిన విషయాలేం లేవు. ఆమె సమస్యలు తప్ప" ఉత్తరం తీసి వృత్తికకు ఇచ్చాను. పని వుందని వీధిలోనికి వెళ్ళిపోయాను.

ఆరాత్రి వృత్తిక పనులు ముగించుకుని పడకగదిలోనికి వచ్చేసరికి పది దాటింది. "మీ రోజారమణి మీద నాకు జాలివేస్తున్నది" అంది వృత్తిక.

"పాపం! ఇప్పుడామె బ్రతుకు అధ్వాన్నమైంది. ఎంత పరుషంగా మాట్లాడుకున్నా భార్యను మెడ పట్టుకు గెంటివేయడం అమానుషం" రోజారమణి భర్తమీద నాకు అమితంగా కోపం వచ్చింది.

"మీరు రోజారమణిని అర్థం చేసుకోవడంలేదు. స్వయంకృతానికి ఎవరేం చెయ్యగలరు?"

"నీవు రోజారమణి భర్తనే సమర్థిస్తున్నావా?" ఆశ్చర్యంగా అడిగాను.

"నేను ఎవరినీ సమర్థించడంలేదు. ఈ పరిస్థితికి రోజారమణే బాధ్యురాలు. ఇద్దరు పిల్లల తల్లియైన రోజా ప్రవర్తనలో ఏదో లోపం ఉంది."

"నీవు స్త్రీవై ఉండి కూడా స్త్రీవాద వ్యతిరేకివి. పెళ్ళి అవగానే ఉద్యోగాన్ని వదులుకున్నావు. ఆర్థిక స్వేచ్ఛ, స్వావలంబనలంటే నీకు నచ్చవు.

కాని నేడు స్త్రీలు ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోరుకుంటున్నారు. రోజారమణి స్వతంత్రంగా జీవించడం నీకు ఇష్టంలేదు.

లేకుంటే ఆమె రాసిన రెండు పేజీల ఉత్తరం చదివి నీవలాంటి నిర్ణయానికి ఎలా వస్తావు? రోజారమణి భర్త ప్రవర్తనలో లోపం ఉండవచ్చు కదా? పురుషాహంకారంతో అతను ప్రవర్తించి భార్య మనసును నొప్పించి వుండవచ్చును కదా?"

రోజారమణి రాసిన ఉత్తరాన్ని వృత్తిక తీసింది.

"న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి అని మీ నాన్నగారు పదేపదే అంటున్నారు. ఇప్పుడు అదేమాట మీరూ అంటున్నారు. స్త్రీలు స్వతంత్రంగా బ్రతకడం మీ పురుషులు ఓర్వలేరా? ప్రతీ చిన్న అవసరానికి మీముందు దేహీ అని చేతులు చాచాలా?

ఇంకా మీరు స్త్రీలను చరణదాసులుగానే చూస్తున్నారా? అని ముఖం మీద అడిగితే మెడబట్టుకుని గెంటి గెటవుట్ అన్నారు. నాకేం, వారిమీద ఆధారపడి బ్రతకటంలేదు. నేను నలుగురిని పోషించగలను అని కదూ రాసింది"

"మరి అభిమానం ఉన్న స్త్రీ పురుషులకు వెట్టిచాకిరి చెయ్యాలని ఎందుకనుకుంటుంది? ఆమె చదువుకుంది, బాగా సంపాదిస్తున్నది. సమానత్వం కోరుకోవడం నేరమా?" అన్నాను.

"ఏమండీ, నేనొక మారు రోజారమణిని కలవాలనుకుంటున్నాను. ఎంతయినా మీరు ఒకప్పుడు ఆమెను ప్రాణంగా అభిమానించారు. ఇప్పుడు ఆమె జీవితం మోడువారకూడదు."

"భర్త ఆదరించినా చీదరించినా స్వాభిమానం చంపుకుని అతనికి ఊడిగం చేస్తూ బ్రతకమని

సలహా ఇవ్వదలిచావా? రోజా తత్వం నీకు తెలీదు"

"ఆమె తత్వం నాకు కొంతయినా అర్థమైంది. అర్థంకానిది మీకే. ఆమెది చపల స్వభావం. ఆమెది కుసంస్కారం. ఆ విషయాలు అర్థం చేసుకోవడానికి ఆమె మనకి రాసిన ఈ ఉత్తరం చాలు. భర్తను చులకనచేస్తూ కోపం తెప్పించడానికి ఆమె సంధించిన వాగ్బాణాలే ఈ అనర్థానికి హేతువు.

ఇంత సుదీర్ఘమైన లేఖ మీకు రాసింది. ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యమేకాదు భావస్వాతంత్ర్యం కూడా వున్నట్లు స్పష్టమౌతోంది. ఆమె ఆలోచనాక్రమంలో అపశ్రుతులున్నాయి. భార్యాభర్తలు ఆలోచించుకోవలసినది సోషల్‌ఫిలాసఫీ గురించి కాదు. ఆలోచించవలసినది పిల్లల భవిష్యత్తు గురించి.

ఆమె ఉద్యోగం మానేసి సామాన్య గృహిణిగా మారితే పరిస్థితులు వాటంతటవే చక్కబడతాయి. స్త్రీలకు చదువుండాలి. అవసరమైతే ఉద్యోగాలు చేయాలి. ఆర్థిక స్వాతంత్ర్యపు హక్కు స్త్రీలకూ ఉండాలి. ముఖ్యంగా ఒకరి సంపాదనతో సంసార శకటం నడవనప్పుడు స్త్రీలు తమ చదువులను సార్థక్యం చేసుకుని ఉద్యోగాలు చేయాలి.

ఆవిధంగా వారు కుటుంబ ఉన్నతికి చేయి కలపాలి. అలా ఎందరో స్త్రీలు పనిచేస్తూ వాళ్ళ గృహాలను స్వర్గధామాలుగా చేసుకుంటున్నారు. అయితే తను సంపాదిస్తున్నాననే గర్వం స్త్రీకి ఉండరాదు.

మగవాడి విషయంలో ఆలికి అన్నంపెట్టడం ఎలా ఊరికి ఉపకారం కాదో అలాగే స్త్రీ సంపాదన తన కుటుంబం కోసమేననే ఆలోచన ఉండాలి. సంసార రథానికి భార్యాభర్తలు రెండు చక్రాల లాంటివారు. అందులో ఒకటి ఎక్కువా కాదు. రెండవది తక్కువా కాదు.

అనాదిగా మనది పురుష ప్రధాన సంస్కృతి. అయినా స్త్రీకి ఉన్నతాసనమే ఉంది. మన సంస్కృతిలో స్త్రీ తన అధికారాలకోసం నడుంకట్టి పోరాడవలసిన అవసరం లేదు. తన విధులను సక్రమంగా నిర్వహించుకుపోతూ వుంటే అధికారాలు వాటంతట అవే ఆమె కైవశం అవుతాయి.

ఈ శ్లోకం వినండి.

**"భద్రమిచ్ఛంత ఋషయఃస్వర్విదః తపో దీక్షా ముపనిషేదు రగ్రే**
**తతో రాష్ట్రం బలమోజశ్చజాతం తదస్మైదేవా ఉపసం నమంతు."**

ఆ శ్లోకం అర్థమమిటో నాకు బోధపడలేదు. దానినెందుకు ఉదహరించిందో కూడా తెలియలేదు. అదే విషయం అడిగాను.

ఆత్మజ్ఞానులైన ఋషులు జగత్కళ్యాణము సాధించవలెనను కోరికతో సృష్టి ప్రారంభంలో దీక్ష వహించి సాగించిన తపస్సు వలన రాష్ట్రం నిర్మాణమైనది. రాష్ట్రీయ బలం, ఓజస్సు ఉత్పన్నమైనవి. అందుచేత దేవగణములన్నియు ఈ రాష్ట్రమందు వినమ్రులై సేవచేయుదురుగాక అని అర్థం. ఇప్పుడు మన మేధావులు కొందరంటున్నట్లు మనది 'ఏ నేషన్ ఇన్ మేకింగ్' కాదు.

ఈ రాష్ట్రం ఈ జాతి నిత్యనూతనమే కాదు, చిర పురాతనమయింది కూడా. దేవగణములు ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న కారణంగా మన సంస్కృతీ సభ్యతలను కాపాడుకుంటూ ఆ పరిధిలో జీవించినంత కాలం మన కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాదు.

తులసివనంలో గంజాయి మొక్కల్లా కొందరు అర్థంలేని ఆశయాలతో లక్ష్మణరేఖను దాటాలనుకుంటారు. అలాంటివారిని హెచ్చరించడం మన ధర్మం" అంది వృత్తిక. ఆమె ఆశయం నెరవేరాలని నేను మనసులోనే ఆకాంక్షించాను.

**(స్వాతి మాసపత్రిక - డిసెంబరు 2001)**